ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 7 నవంబరు 2024 | 5



కాకినాడ దుమ్ములపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు




కేన్సర్.. కబళిస్తోంది!

- పేద, మధ్య తరగతి వారి జీవితాలు అతలాకుతలం
- అవగాహనతోనే కేన్సర్ వ్యాప్తికి చెక్
- నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం

6

తల్లిపాలే.. అసలైన వ్యాక్సిన్!



కాకినాడ జీజీహెచ్‌లోని ఎన్‌ఐసీయూలో వార్మర్లు

- ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లీబిడ్డల బంధమే ప్రధానం
- ఉమ్మడి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న మరణాల రేటు
- కాకినాడలో శిశుగృహ ద్వారా పిల్లల సంరక్షణ
- మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు..
- ఏజెన్సీలో 7 నెలల్లో 49 మంది మృతి
- నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

6

పిఠాపురంపై.. పవన్ ముద్ర!





పిఠాపురం పట్టణం

అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, దేశంలోనే పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆ దిశగా అడుగులు వేయడమేగాక ఈ ప్రాంతంపై తనదైన ముద్రను బలంగా వేస్తున్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పిఠాపురం ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు, ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిగా ఉన్న సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు నిధులు, అదనపు పోస్టుల మంజూరుకు చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం లభించింది.

- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- పాడా పరిధిలోకి రెండు పట్టణాలు, 52 గ్రామాలు
- సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్
- అభివృద్ధికి రూ.38.32కోట్లు కేటాయింపు
- మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం ప్రతిపాదనలకు ఆమోదం

పిఠాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తనను శాసనసభ్యుడిగా గెలిపించి అసెంబ్లీకి పంపడమేగాక డిప్యూటీ సీఎం హోదాలో కూర్చోబెట్టడంతోపాటు రాష్ట్రంలో, దేశంలో బలంగా నిలిపిన పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, ఎన్నికల తర్వాత పిఠాపురం సభలో ప్రకటించిన పవన్ అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. రెండు రోజుల క్రితమే గొల్లప్రోలు సభలో తాను ఇప్పటి వరకూ చేసిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి చేసిన కృషి, జరుగుతున్న, జరగబోయే పనుల గురించి వివరించారు. అన్నట్లుగానే అన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నారు. గొల్లప్రోలు సభలో పవన్ ప్రకటించిన 48గంటలు గడవక ముందే కీలకమైన రెండు అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

పిఠాపురం సమగ్రాభివృద్ధికి పాడా

పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పిఠాపురం ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ(పాడా) ఏర్పాటు ప్రతిపాదనను పవన్ ముందుకు తీసుకువచ్చారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు పిఠాపురం మండలంలోని 24 గ్రామాలు, గొల్లప్రోలు మండలంలోని 10 గ్రామాలు, కొత్తపల్లి మండలంలోని 18 గ్రామాలు వెరసి 52 గ్రామాలను పాడా పరిధిలోకి తీసుకువచ్చారు. పిఠాపురం ప్రాంత సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రివర్గ సమావేశం అనంతరం సమాచారశాఖా మంత్రి కొలుసు పార్థసారధి ప్రకటించారు. క్యాబినెట్ సమావేశంలో పవన్ ద్వారా వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. పాడా ఏర్పాటువల్ల ఇప్పటి వరకూ కాకినాడ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ(కుడా) పరిధిలో ఉన్న ఈ రెండు పట్టణాలు, 52 గ్రామాలు పాడా పరిధిలోకి వస్తాయి. దీనివల్ల వీటిని పాడా ద్వారా అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్లాన్స్, లేఅవుట్లు ఆమోదం రుసుం, ఇతరత్రా మార్గాల్లో పాడాకు ఆదాయం వస్తుంది. పట్టణాభివృద్ధి సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నాయి. మరోవైపు పాడా వైస్‌చైర్మన్‌గా ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తారు. చైర్మన్‌గా అనధికారలను నియమించే వరకూ జిల్లా కలెక్టర్ లేదా జేసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు..

పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నామని పవన్ ప్రకటించిన నేపథ్యంలో అందులో పాడా ఏర్పాటు కీలకంగా మారనుంది. ఇప్పటికే రుడా, కుడాలకు గతంలో ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించారు. పాడా పరిధిలోకి వచ్చే ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు గాను ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. దీనివల్ల నియోజకవర్గం యూనిట్‌గా ఉంటుంది. కొత్తపల్లిలోని సముద్రతీరం, సెజ్ భూములు ఉన్న ప్రాంతాలు పాడా పరిధిలోకే రానున్నాయి.

మారనున్న ప్రభుత్వాస్పత్రి రూపురేఖలు



ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిగా ఉన్న పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(ప్రభుత్వాస్పత్రి) 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఇక్కడ సీహెచ్‌సీ స్థానంలో ఏరియా ఆస్పత్రి ప్రజలకు త్వరలో అందుబాటులోకి రానుంది. ఇందుకు అనుగుణంగా అదనపు భవనాల నిర్మాణం, స్కానింగ్ వంటి అత్యాధునిక సదుపాయాల కల్పనకు, ఇతర మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు రూ.38.32కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. అదనంగా సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర నిపుణులు, స్టాఫ్‌నర్సులు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది మొత్తం 66 పోస్టులను మంజూరు చేశారు. పిఠాపురం నియోజకవర్గంతోపాటు ప్రత్తిపాడు, పెద్దాపురం, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల నుంచి అత్యధికంగా రోగులు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌకర్యాలు సరిపోవడం లేదు. 30 పడకల ఆస్పత్రి అయిన కొవిడ్ సమయంలో దాతల సహకారంతో సమకూర్చిన బెడ్‌లు, ఇతరత్రా వచ్చిన బెడ్‌లు కలిపి మరో 30 పడకలు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. రోగుల సంఖ్య గణనీయంగా పెరిగినా వైద్యులు, సిబ్బంద సరిపడా లేకపోవడంతో ఇటీవల పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అదనంగా ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక స్టాఫ్ అటెండెంట్‌ను నియమించారు. సీఎస్‌ఆర్ నిధులతో ఎక్స్‌రే ప్లాంటును అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో కొంతవరకూ ఇబ్బందులు పరిష్కారమయ్యాయి. ఇప్పుడు 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన 6-7లక్షల మంది ప్రజలకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. కార్పొరేట్‌స్థాయిలో పిఠాపురం ఆస్పత్రిని తీర్చిదిద్దుతానని ఎన్నికల ముందు, తర్వాత ప్రకటించిన పవన్‌కల్యాణ్ అందుకు అనుగుణంగా మంత్రివర్గ ఆమోదం పొందడంతో ఇక అప్‌గ్రేడేషన్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. పిఠాపురం అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా పవన్ తీసుకుంటున్న చర్యలపట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగనంపేశారు





గనులశాఖ డీడీ కార్యాలయం.. డీడీ ప్రసాద్

- జిల్లా గనులశాఖ డీడీ ప్రసాద్ అవుట్
- విధుల్లో చేరిన కొద్దిరోజులకే సెలవుపై పంపేసిన ప్రభుత్వం
- ఇక్కడా మైనింగ్ అక్రమాలకు వత్తాసు
- లీజుదారులతో మిలాఖత్
- నేరుగా కార్యాలయంలో అన్ని విధాలా సహకారం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ కేఎల్‌వీ ప్రసాద్‌ను ప్రభుత్వం సాగనంపేసింది. డీడీగా విధుల్లో చేరి నెల తిరక్కుండానే సెలవుపై పంపేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చిత్తూరు జిల్లాలో డీడీగా పనిచేసిన ప్రసాద్ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లో పనిచేశారు. ఆయన మైనింగ్ అక్రమాలకు అడ్డగోలుగా సహకరించారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతున్నా కనీసం పట్టించుకోలేదు. పూర్తిగా గనులశాఖను సదరు నేత చేతుల్లో పెట్టేశారు. ప్రభుత్వం మారిన తర్వాత ఇటీవల జిల్లాకు డీడీగా ప్రసాద్ బదిలీపై వచ్చారు. తీరాఇక్కడా లీజుదారులతో మిలాఖత్ అయ్యారు. పాత లీజుల కొనసాగింపు, జరిమానాల విధింపు విషయంలో వ్యాపారులు చెప్పినట్లే తలూపారు. నేరుగా కార్యాలయానికి వచ్చే లీజుదారులతో మంతనాలు జరిపారు. ఇలా అడుగడుగునా అడ్డగోలుగా వ్యవహరించిన డీడీపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. సెలవుపై వెళ్లిపోవాలని మౌఖికంగా ఆదేశించింది. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీడీగా మరొకరిని నియమించారు. కాగా జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయం మైనింగ్ వ్యాపారుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఏ ఫైలు కదలాలన్నా, కంప్యూటర్లలో ఏం పనిచేయాలన్నా స్వయంగా సిబ్బంది పక్కనే కూర్చుని సదరు వ్యాపారులు తమ కనుసన్నల్లో కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. నెలవారీ మామూళ్లతో కొందరు అధికారులు, సిబ్బంది సదరు వ్యాపారులు చెప్పినట్లల్లా తలూపుతున్నారు.

అంతా అడ్డగోలే...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గనులశాఖలో కొందరు అధికారుల పాపాలు పండుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏమాత్రం జంకు లేకుండా వైసీపీ నేతలు చెప్పినట్టల్లా తలూపి గనులశాఖను సదరు నేతల చేతుల్లో పెట్టేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల అక్రమాలకు వత్తాసు పలికి అవినీతిలో భాగస్వాములయ్యారు. దీనివల్ల ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత అక్రమాలు వెలుగులోకి రావడంతో ఉద్యోగరిత్యా తీవ్ర చిక్కులు ఎదుర్కొంటున్నారు. దీనికి నిదర్శనమే జిల్లా గనులశాఖ డీడీ ప్రసాద్. జిల్లా డీడీగా బాధ్యతలు స్వీకరించి నెల తిరగకముందే ఆయన్ను ప్రభుత్వం సెలవులో పంపేసింది. నాలుగురోజుల కిందట ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీడీగా శివకుమార్‌ను నియమించింది. వాస్తవానికి డీడీ ప్రసాద్ జిల్లాలో డీడీగా పనిచేయక ముందు గత వైసీపీ సర్కారు హయాంలో చిత్తూరు జిల్లా డీడీగా పనిచేశారు. ఆ సమయంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి చెప్పిన అడ్డగోలు పనులన్నింటికీ తలూపారు. మైనింగ్ తవ్వకాలకు అనుమతులు లేకపోయినా సదరు నేతలు బరితెగిస్తుంటే చూస్తూ కూర్చున్నారు. జరిమానాల విధింపులు లేకుండా, దాడులు చేయకుండా సహకారం అందించారు. దీంతో ప్రభుత్వానికి కోట్లలో నష్టం వాటిల్లింది. కూటమి ప్రభుత్వం వచ్చాక డీడీ ప్రసాద్‌ను జిల్లా డీడీగా నియమించింది. ఇక్కడకూడా లీజుదారులతో మిలాఖత్‌అయ్యారు. రామేశంమెట్ట, రౌతులపూడిలో మైనింగ్ చేస్తోన్న వ్యాపారులతో చేతులు కలిపారు. నేరుగా కార్యాలయంలో వారితో మంతనాలు జరిపారు. రౌతులపూడిలో ఓ క్వారీకి లీజు పొడిగింపు, అక్రమ తవ్వకాలకు సంబంధించి జరిమానాల విధింపులో ఓ వ్యాపారికి అనుకూలంగా వ్యవహరించారు. అదే వ్యాపారి పెద్దాపురం రామేశంమెట్ట నుంచి అచ్చంపేట, పోర్టు హైవే పనులకు గ్రావెల్ తరలింపు ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నా సహకరించారు. దీంతో ఇవన్నీ కలగలిపి సదరు డీడీపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. డీడీ ప్రసాద్ స్థానంలో ఇంతకుముందు పాత డీడీగా నరసింహారెడ్డి పనిచేశారు. ఆయనైతే ఏకంగా కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి అడ్డగోలుగా సహకరించారు. రామేశంమెట్టను గుల్లచేసి అనుమతులు లేకుండా లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలిపోతుంటే ఆ ముసుగులో తన జేబులు నింపేసుకున్నారు. ప్రభుత్వ ఖజానాకు కోట్లలో నష్టం వాటిల్లేలా చేశారు. కనీసం అక్కడకు వెళ్లి అక్రమ తవ్వకాలు పరిశీలించడం, జరిమానాల విధింపు ఇదేం చేయలేదు సరికదా ద్వారంపూడి అవినీతికి పూర్తిగా సహకరించారు. ఈ నేపథ్యంలో దీనికి బాధ్యుడిగా గుర్తించి బదిలీపై వెళ్లి విజయనగరం డీడీగా పనిచేస్తున్న సదరు నరసింహారెడ్డిని సైతం ప్రభుత్వం తాజాగా సెలవులో పంపేసింది.

పెత్తనం వ్యాపారులదే..

జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయం పూర్తిగా మైనింగ్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇక్కడ రోజంతా డీడీ కార్యాలయంలో వ్యాపారులు పాగా వేసి స్వయంగా సిబ్బంది పక్కన కూర్చుని కావాల్సిన పనులు అడ్డగోలుగా చేయించుకుంటున్నారు. మైనింగ్ పర్మిట్లు, లీజుల జారీ, లైసెన్సుల పొడిగింపు, సర్వేలు, జరిమానాల విధింపు లేకుండా చేసుకోవడం ఇలా అన్నీ తమకు నచ్చినట్లు చేయించుకుంటున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీడీ కార్యాలయం వైసీపీ నేతల కోసమే పనిచేసింది. ప్రభుత్వం మారినా లీజులు ఇంకా సదరు నేతలు, వారి అనుచరుల చేతుల్లో ఉండడంతో ఇప్పటికీ ఇక్కడకు వచ్చి డీడీ కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తున్నారు. నెలవారీ మామూళ్లు దండిగా అందిస్తుండడంతో కార్యాలయంలో కొందరు అధికారులు, సిబ్బంది పూర్తి సహకారం అందిస్తున్నారు. ఫైళ్లు సదరు వ్యాపారుల చేతుల్లో పెట్టడం, వారు చెప్పినట్లు మార్చి రాయడం, కంప్యూటర్లలో డేటా మార్పులు సైతం పక్కనే కూర్చుని ఆదేశిస్తున్నారు.

టీసీసీ కోర్సుకు 30లోపు దరఖాస్తు చేసుకోవాలి: డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ)కి సంబంధించిన డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌లూమ్ అండ్ వీవింగ్ లోయర్, హయ్యర్ కోర్సులకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు అపరాధ రుసుము లేకుండా ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబరు 10లోపు, రూ.75 అపరాధ రుసుంతో 13లోపు ఫీజు చెల్లించిన చలానా, ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు సంబంధిత నకళ్లను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

శలపాక హత్య కేసులో.. ఐదుగురు అరెస్టు

7

అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోను అమలు
- పట్టభద్రుల ఓటు నమోదుకు 23 వరకు అవకాశం: కలెక్టర్



విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన దృష్ట్యా జిల్లాలో నియమావళి అమల్లోకి వచ్చిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను సంబంధించి పత్రికా విలేకరుల సమావేశంలో సంబంధిత వివరాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. నవంబరు 11న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. అదే రోజు నుంచి ఈనెల 18వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 19న నామినేషన్లు పరిశీలన ఉంటుందన్నారు. ఈనెల 21న నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చునన్నారు. డిసెంబరు 5న పోలింగ్, డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా తూర్పు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల కోడ్ ఆఫ్ కాండాక్ట్‌ను అమలు చేస్తామన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా, కాకినాడ డీఆర్వో, తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో, పశ్చిమగోదావరి జిల్లా డీఆర్వో, ఏలూరు జిల్లా డీఆర్వోలు వ్యవహరిస్తారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 113 మండలాల్లో మొత్తం 16316మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 9674మంది, స్త్రీలు 6642మంది ఉన్నారన్నారు. 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 11వతేదీ నుంచి 18వతేదీ వరకు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కోర్టు హాలులో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్, ఎంఈవో, పోలింగ్ స్టేషన్‌లో బుధవారం నుంచి హార్డ్‌కాపీ, సాఫ్ట్ కాపీ ఉంచుతామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకున్న వారి జాబితా ఈనెల 23న ప్రచురించే డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో పేర్లు ఉంటాయన్నారు. గురువారం నుంచి 23 వరకు ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబరు 30న ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయన్నారు. 1-11-2024కి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా కంప్లీట్ చేసి ఉండాలన్నారు. పట్టభద్రులు ఎవరైనా తమ ఓటు నమోదు చేసుకోకపోతే ఈనెల 23 వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగాధిపతి జగన్నాథరావు పాల్గొన్నారు.

దూసర్లపూడి దీక్షను విరమింపజేసిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణ పరిధిలో 8 గ్రామాలు విలీనం చేయాలని కోరుతూ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు నాలుగురోజులుగా కాకినాడ కలెక్టరేట్‌వద్ద చేపట్టిన నిరాహార దీక్షను కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కాకినాడ పట్టణానికి ఆనుకుని ఉన్న తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట వంటి 8 గ్రామాలను కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చి ఎన్నికలు నిర్వహించడంతోపాటు 2025-26 ఆర్థిక సంఘం నిధులు వెనక్కిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. ఈ అంశం కోర్టు పరిధిలో 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వ అధికారులతో చర్చించి ఈ గ్రామాలను కాకినాడ పట్టణంలో విలీనం చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా పౌరసంబంధాల అధికారి నాగార్జున పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై ప్రగతి కనబర్చాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వివిధ రెవెన్యూ అంశాలపై ప్రగతి కనబరిచేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనా, కమిషనర్ భావన, ఇతర అధికారులతో కలిసి ఆయన రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, నగర వనం, డంపింగ్‌యార్డ్సు, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులు, ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ తర్వలో సాగునీటి సంఘాల ఎన్నికలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటర్లనమోదు, జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల కోడ్ అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- కాకినాడలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.3480 కోట్ల విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరహాలు, గంగా సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వేయలేదని, ఈ ఏడాది వేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్, చిన్ని, లోవరాజు, సిద్ధు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

తల్లిపాలే.. అసలైన వ్యాక్సిన్!




డాక్టర్ బి.జయరామ్‌జీబాబు



అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఎన్బీఎస్‌యూ యూనిట్‌లో అత్యవసర వైద్యసేవలు.. వైద్య సేవల కోసం వచ్చిన శిశువు

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కోసం ఎన్నో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే పుట్టిన బిడ్డకు ఏ అత్యవసర సేవలు అవసరమైనా అందించేందుకు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య విభాగం ఉంది. న్యూబోర్న్ స్టెబిలేషన్ యూనిట్ (ఎన్బీఎస్‌యూ)లో అత్యాధునిక వైద్య పరికరాలు, సేవలు అందించేందుకు వైద్య నిపుణులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఒక్క అమలాపురం ప్రాంతానికి చెందినవారే కాకుండా రాజోలు, పి.గన్నవరం, అల్లవరం వంటి ప్రాంతాల ప్రభుత్వ వైద్యశాలల నుంచి సైతం శిశువులను తీసుకువస్తున్నారు. ఎన్బీఎస్‌యూలో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా కామెర్లతో బాధపడే శిశువుల కోసం ఫొటోథెరపీ ఉంది. ఫొటోథెరపీ శిశువుకు మందులా పనిచేసి ఆ వ్యాధిని తగ్గిస్తుంది. ఇక ఆక్సిజన్ అందక ఇబ్బంది పడే శిశువుల కోసం సిపాప్ యంత్ర పరికరం అందుబాటులో ఉంచారు. ఇన్ఫెక్షన్లు, ఆయాసం వంటి సమస్యలతో బాధపడే చిన్నారులకు వార్మర్స్ ఫెసిలిటీ చేసే వైద్య పరికరాలున్నాయి. అత్యల్పంగా బరువు ఉన్న శిశువుల కోసం ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. కిలో, కిలోన్నర బరువు ఉన్న శిశువుల ఆరోగ్య పరిస్థితిని గుర్తించి మెరుగైన వైద్య సేవలకు మాత్రమే స్పెషల్ ఎన్బీఎస్‌యూ ఉన్న కాకినాడ జనరల్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తారు. అటువంటి కేసులు చాలా తక్కువ. ఏడాది కాలంలో ఒక్క శిశు మరణం కూడా సంభవించలేదని ఎన్బీఎస్‌యూ విభాగ వైద్యులు డాక్టర్ బి.జయరామ్‌జీబాబు తెలిపారు. ఎన్బీఎస్‌యూలో నెలకు 60 నుంచి 70 మంది శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని, కొద్దిపాటి అనారోగ్య సమస్యలు ఉన్న వారికి కూడా ఒకట్రెండు రోజులు వైద్యసేవలు అందించడం వల్ల నెలకు అడ్మిషన్ల సంఖ్య 120కు చేరిందన్నారు.

ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లీబిడ్డల బంధమే ప్రధానం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :అప్పుడే పుట్టిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. పుట్టిన గంటలోనే శిశువుకు ముర్రుపాలు తాగించాలి. బిడ్డను వెచ్చటి శుభ్రమైన దుస్తులతో కప్పిఉంచి తల్లికి దగ్గరగా ఉంచాలి. బిడ్డ నెలలు నిండకుండా పుడితే బిడ్డను ఇంక్యుబేటర్‌లో ఉంచాలి. ఆరోగ్య పరిస్థితిని గమనించాలి. సరైన బరువుతో బిడ్డ ఉందా లేదా చూడాలి. పిల్లలకు పుట్టిన వెంటనే వేయాల్సిన పోలియో మందులు, సూదిమందులు వేయమని డాక్టర్‌ను అడగాలి. సాధారణంగా అప్పుడే పుట్టిన పిల్లలకు ఆసుపత్రుల్లో ఒక ప్రత్యేకమైన కార్డు తీసుకొస్తారు. ఆ కార్డులో బిడ్డకు ఏ సమయంలో ఏ టీకా వేయాలి అనేది ఉంటుంది. ఈ టీకాలు బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే, విటమిన్ కే ఇచ్చారా? లేదా అనేది తెలుసుకోవాలి. శిశువును తల్లి దగ్గరే పడుకోబెట్టి తల్లి స్పర్శ తగిలేలా ఉంచితే సరైన టెంపరేచర్ మెయింటైన్ అవుతుంది. చాలామంది తల్లులు, కుటుంబీకులు బిడ్డలకు పాలు తాగించడం, డైపర్లు మార్చడంపైనే దృష్టి ఉంచుతారు. కానీ ఇతర విషయాలను గమనించాలి. వినికిడి శక్తి బాగానే ఉందని తెలుసుకోవాలి. కంటిచూపు వస్తువులు, రంగులపైనా ఉందా లేదా అనేది గమనించాలి. ఆరోగ్యకరమైన ఎదుగుదల ద్వారానే తల్లి, బిడ్డ బంధం బలపడుతుంది. శిశువు బోర్లా పడడం, వెల్లకిలా పడుకోవడం లాంటివి వాళ్లకు వాళ్లే చేయాలి తప్ప బలవంతంగా మార్చకూడదు. పిల్లల ఏడుపు మొదటి ఆరు ఆరువారాల్లో ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుతుంది. ఏదైనా అసాధారణమైన మార్పు కానీ, లక్షణం కానీ కనిపిస్తే డాక్టర్ దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే బరువు సరిగా పెరుగుతున్నారా లేదా అనేది గమనించాలి. దీన్ని త్వరగా తెలుసుకోవాలి. ఆకలిని బట్టి ఆహారం ఇవ్వాలి. ఇదేం తప్పుకాదు. ప్రతి బేబీకీ 6 నెలల వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. నీళ్లు, ఇంకేమీ ఇవ్వకూడదు. ఆవుపాలు, గేదెపాలు ఇవ్వకూడదు. మెడికల్లీ ఇండికేటెడ్ అయితేనే ప్రత్యామ్నాయ ఆహారాన్ని అందించాలి. ఆరు నెలల తర్వాత శిశువుకు తయారుచేసిన ఆహారం పెట్టాలి.

● తల్లికి అనేక ప్రశ్నలు..

అప్పుడే పుట్టిన బేబీకి అవసరాలు తక్కువగా ఉంటాయి. బేబీని తల్లి నుంచి వేరు చేసిన తర్వాత ఆ శిశువు తన టెంపరేచర్ తాను మెయింటెన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నెల రోజులపాటు జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో అరచేతులు, అరికాళ్లలో వేడి కోల్పోతారు. దీనికోసం మంచిగా దుస్తులు కప్పి ఉంచాలి. శిశువులో ఏ పార్టు అయినా వెచ్చగా ఉండాలి. టెంపరేచర్ సరిగా మెయింటైన్ చేయలేకపోతే షుగర్‌లెవెల్స్ పడిపోతాయి. ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. బ్రెస్ట్‌ఫీడ్ ముఖ్యం. బిడ్డకు ఫస్ట్ వ్యాక్సిన్ తల్లిపాలే అన్న సంగతి గుర్తుంచుకోవాలి.

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సేవలివీ..



శిశువుల సంరక్షణ కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. ఎంసీహెచ్ బ్లాకులోని పీడియాట్రిక్స్ విభాగంలోని వైద్యబృందం అప్పుడే పుట్టిన శిశువులతోపాటు, చిన్నారులకు వైద్యసేవలందిస్తున్నారు. నవజాత శిశువుల కోసం లెవెల్ -2 కేర్‌గా పిలిచే అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ఎస్ఎన్‌సీయూ బ్లాకు అందుబాటులో ఉంది. తలసేమియా, హీమోఫిలియా వంటి కేసుల్లోనూ ఇక్కడ వైద్య సేవలు పూర్తి ఉచితంగా లభిస్తున్నాయి. జీజీహెచ్‌లో పిల్లల ఓపీ ప్రతిరోజూ సగటున 70 వరకూ ఉంటోంది. ఇన్‌పేషెంట్లు అడ్మిషన్లు 10 వరకూ జరుగుతున్నాయి. దీంతోపాటు డైస్ (డీఈఐసీ) కేంద్రం ద్వారా ముందస్తుగానే చిన్నారుల్లో వినికిడి, ఇతర వైకల్యాలు, శారీరక లోపాల గుర్తింపు ప్రక్రియ సైతం చేపడుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మోహన్‌చంద్ర మాట్లాడుతూ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలతోనే తల్లీ, బిడ్డ బంధం బలపడుతుందన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వయస్సు వచ్చే వరకూ శిశువుకు తల్లిపాలు అత్యంత శ్రేయస్కరమని చెప్పారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే పిల్లల డాక్టర్‌ను సంప్రదించాలని, రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మోహనచంద్ర పేర్కొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న మరణాల రేటు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చంటిబిడ్డకు దివ్య ఔషధం తల్లి పాలు. అంటే బిడ్డతోపాటు తల్లి ఆరోగ్యమూ ముఖ్యమే. కానీ తల్లులు పోషకాహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో శిశుమరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది 26,732 మంది శిశు జననాలుండగా, 284 మంది శిశువులు మరణించారు. దీని ప్రకారం.. వెయ్యిమందిలో పది మంది మృత్యువాతపడ్డారు. దీంతో శిశు మరణాల రేటు 1.06 శాతంగా నిర్ధారించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 16,166 శిశు జననాలకుగాను 179 మంది మరణించారు. దీని ప్రకారం.. వెయ్యిమందిలో 11 మంది మృతి చెందారు. శిశు మరణాల రేటు 1.17 శాతంగా నిర్ధారించారు. ఇది ఆందోళన కలిగించే విషయం. తల్లి హైరిస్క్ ప్రెగ్నెన్సీ, చిన్న వయస్సులో పెళ్లిచేయడం, మేనరికం, పోషకాహార లోపం వంటి కారణాలతో శిశు మరణాలతోపాటు మాతృమరణాలూ సంభవిస్తున్నాయి. అయితే కాకినాడ జీజీహెచ్‌లోని పిడియాట్రిక్స్ (చిన్న పిల్లల) విభాగం రాష్ట్రంలోని 11 బోధనాస్పత్రులకంటే అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ (ఎన్ఐసీయూ) నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (నవజాత శిశు సంరక్షణ కేంద్రం) చంటి పిల్లలకు పునర్జన్మను ప్రసాదించేదిగా ఉంది. ఇక్కడ నిష్ణాతులైన వైద్యులు 24 గంటలపాటు సేవలందిస్తున్నారు.

ఎంతోమంది శిశువులకు పునర్జన్మ



జీజీహెచ్ పిడియాట్రిక్స్ విభాగంలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 12 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లల వరకు వైద్యం అందిస్తున్నాం. ముఖ్యంగా ఈ విభాగంలో ఎన్ఐసీయూ ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ తక్కువ బరువు ఉన్న శిశువులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువులు, పచ్చకామెర్లతో పుట్టిన శిశువులకు ప్రత్యేక వెంటిలేటర్‌లు, వార్మర్ల సహాయంతో ప్రత్యేక చికిత్స అందిస్తున్నాం. అనంతరం పీఐసీయూలో ఉంచి ప్రత్యేక వైద్యచికిత్స అందిస్తున్నాం. ఇక్కడ అత్యాధునిక వైద్య సదుపాయాలు, ఖరీదైన మందులు కూడా ఇస్తున్నాం. తద్వారా చిన్నారులు మెరుగైన వైద్యచికిత్స పొంది ఆరోగ్యవంతులవుతున్నారు. ఇక్కడ పిడియాట్రిషియన్లు, నియోనటాలజిస్టులు, పిడియాట్రిక్ సర్జన్లు అందుబాటులో ఉన్నారు.

- డాక్టర్ డి.మాణిక్యాంబ, హెచ్‌వోడీ, కాకినాడ జీజీహెచ్

కాకినాడలో శిశుగృహ ద్వారా పిల్లల సంరక్షణ


కె.ప్రవీణ, మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారిణి, కాకినాడ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ సాధికారిక అధికారుల వారి సంరక్షణలో శిశుగృహ నడుస్తోంది. కాకినాడ అశోక్‌నగర్‌లో శిశుగృహ ఉంది. అవాంఛనీయ గర్భం దాల్చి పిల్లలు వద్దు అనుకున్నవారు, శిశువును పెంచి పోషించే స్థోమత లేనివారు, ఎవరికైనా దత్తత ఇచ్చేయాలని అనుకున్నవారు, అనాథ పిల్లలు, నిరాదరణకు గురైన పిల్లలు, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, పార్కు, ఆసుపత్రులు, చెత్తకుప్పల్లో వదిలేసిన శిశువులు, తప్పిపోయిన పిల్లలను శిశుగృహలో సంరక్షిస్తూ వారి యోగక్షేమాలు చూస్తుంటారు. ఎవరైనా అనధికార దత్తత తీసుకున్నా ఆ సమాచారాన్ని వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు 100 లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారిని రక్షించి బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి బాలల సంక్షేమ సమితి ఆదేశాలతో శిశుగృహ, బాలల రక్షితగృహాల్లో సంరక్షణ కల్పించి ప్రత్యేక దత్తత వనరుల సంస్థ(కారా), న్యూఢిల్లీ వారి నిబంధనల ప్రకారం చట్టపరంగా దత్తత ఇస్తారు.2015 నుంచి ఇప్పటివరకు శిశుగృహ ద్వారా సంరక్షించిన పిల్లలను విదేశీ దత్తతకు-ఆడపిల్లలు 50మంది, మగపిల్లలు 23మంది. స్వదేశీ దత్తతకు ఆడపిల్లలు 10మంది,మగపిల్లలు ముగ్గురిని దత్తత ఇచ్చామని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి కె.ప్రవీణ తెలిపారు.

మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు.. 7 నెలల్లో 49 మంది మృతి

మరో 46 మందికి గుండె జబ్బులు
బలహీనంగా జన్మించినవారు 113 మంది
మరణాల నిష్పత్తి 3.41 శాతం


చింతూరులో మృతి చెందిన పసిబిడ్డ (ఫైల్)

చింతూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకర్తల నుంచి వైద్యుల వరకు నిత్య పర్యవేక్షణతో కూడిన సేవల్లో నిమగ్నమవుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ మన్యంలో శిశు మరణాలను మాత్రం నిలువరించలేకపోతున్నారు. చింతూరు డివిజనులో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 1435 మంది తల్లులు తమ బిడ్డలకు జన్మనిచ్చారు. కాగా వీరిలో 49 మంది చిన్నారులు మృత్యువాతపడ్డారు. అంటే 3.41 శాతం మరణాల రేటు నమోదైనట్టు అధికారిక గణాంకాలే స్పష్టంచేస్తున్నాయి. నమోదుకాని మరణాలు కూడా ఉండి ఉంటాయన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఇక ఒక్క చింతూరు ఏరియా ఆసుపత్రిలోనే జనవరి నుంచి అక్టోబరు వరకు 689 మంది జన్మించారు. వీరిలో 46 మంది చిన్నారులకు గుండె జబ్బులు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. మరో 113 మంది చిన్నారులు సాధారణ బరువు రెండున్నర కేజీలు కాగా అంతకంటే తక్కువ బరువుతో పుట్టారు. ఇందుకు ప్రధాన కారణం పౌష్టికాహరలోపమేనని చెబుతున్నారు. చింతూరు డివిజనులో 10 ప్రాథమిక వైద్యశాలలు, ఒక ఏరియా ఆసుపత్రితోపాటు ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటరు, ప్రత్యేక నవజాతి నవజాతి శిశు చికిత్స కేంద్రం కూడా ఉంది. మరోవైపు 266 ప్రధాన అంగన్వాడీ, 166 మిని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. చింతూరులోని ప్రత్యేక నవజాతి శిశువైద్య శిబిరం ద్వారా ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 0 నుంచి 30 రోజుల వయస్సు ఉన్న 334 మందికి చిన్నారులకు చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా.. ఒక మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి మొదలు బిడ్డకు 3 సంవత్సరాలు వయస్సు వచ్చేంత వరకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. వీటిలో బాలసంజీవని కిట్, టేక్ హోం రేషను వరకు ఉన్నాయి. ఇక బిడ్డకు 3 సంవత్సరాల వయస్సు దాటిన నుంచి అంగన్వాడీ కేంద్రంలోనే ఆయా చిన్నారులకు ప్రతిరోజు గుడ్డు, పాలుతోపాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. ఇన్ని వసతులు కల్పిస్తున్నా శిశుమరణాలు మాత్రం ఆగడంలేదు. గుండె జబ్బులు, రక్తహీనత, శ్వాసకోస ఇబ్బందులు బిడ్డల్ని పట్టి పీడిస్తున్నాయి.

నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం



కేన్సర్.. కబళిస్తోంది!

● పేద, మధ్య తరగతి వారి జీవితాలు అతలాకుతలం
● అవగాహనతోనే కేన్సర్ వ్యాప్తికి చెక్ ● అందుబాటులో వైద్య సేవలు

(జీజీహెచ్(కాకినాడ)/సర్పవరం జంక్షన్/రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి):

పూర్వం అరవై ఏళ్లు దాటినవారు కేన్సర్ వ్యాధి బారినపడేవారు. కేన్సర్ వ్యాధికి గురైతే ప్రాణం కోల్పోతామన్న భయందోళన ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మెరుగైన చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేన్సర్ మహమ్మారి ఏటేటా విస్తరిస్తూ ఉండడమే విషాదం. చిన్నా పెద్దా అనే వయసుతో తేడా లేకుండా ఈ వ్యాధి బారిన పడుతుండడం భయాందోళనకు గురిచేస్తోంది. ప్రజల మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశపారపర్యం వంటి కారణాలతో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇక కేన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే వైద్యులు రేడియేషన్, కీమోథెరపీ చికిత్స ద్వారా విస్తరించకుండా నివారిస్తున్నారు. నిజానికి కేన్సర్ అంటే నిశ్శబ్ద ఉపద్రవం. తెలుసుకునేలోపే అది ముదిరిపోయి ప్రాణాలను హరిస్తుంది. కేన్సర్ తొలిదశలో ఏమీ తెలియదు. ఏదైనా స్కాన్ చేయించుకుంటే తప్ప బయటపడదు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ముందుగానే తెలుసుకుంటే దాని నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. బ్రెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గర్భసంచి కేన్సర్, ఓవెరీ కేన్సర్, కొలన్ కేన్సర్, సర్కోమా కేన్సర్, చర్మ కేన్సర్ (స్కిన్), మూత్రాశయం (ప్రోస్టేట్) కేన్సర్, కొలోస్/రెక్టం (పెద్ద పేగు భాగం) కేన్సర్, కిడ్నీ కేన్సర్, బ్లడ్ కేన్సర్, అండాశయ కేన్సర్, కడుపు కేన్సర్, నోటి కేన్సర్, ఎముకల కేన్సర్, కాలేయ కేన్సర్ తదితర రకాల బారిన రోగులు పడుతున్నారు. అయితే ఇప్పటికీ కొన్ని కేన్సర్లు మొండిఘటాలుగానే ఉంటున్నాయి. ప్రాంకియాట్రిక్ కేన్సర్, బ్రెయిన్ కేన్సర్, లివర్ కేన్సర్, కడుపులో, ఊపిరితిత్తుల్లో వచ్చే కేన్సర్లు ప్రాణాంతకమేనని వైద్యులు చెబుతున్నారు.

● మహిళల్ని వేధిస్తున్న బ్రెస్ట్ కేన్సర్

మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ కేన్సర్ బారిన పడుతున్నారు. రొమ్ములపై నొప్పిలేని గడ్డలు ఏర్పడినా, మార్పులు కనిపించినా, గడ్డలు గట్టిగా ఉన్నా, అధికంగా వచ్చినా వెంటనే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి. లేదంటే బ్రెస్ట్ కేన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. రొమ్ముల వాపు, చనుమొనలు నొప్పి, చనుమొనల ఉంచి స్రవాలు కారడం, లోపలకి కుచించుకుపోవడం, ఎర్రగా మారడం వంటి లక్షణాలను రొమ్ముకేన్సర్‌గా భావించాలి. అధిక సంఖ్యలో మహిళలు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముందస్తుగా గుర్తిస్తే కోలుకోవడం సులభం కూడా.

● తొలి దశలోనే అడ్డుకట్ట..

కేన్సర్లకు తొలిదశలోనే అడ్డుకట్ట వేయాలి. శరీరంలో ఎక్కడో ఒకచోట మొదలై చాపకింద నీరులా ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. ఎన్నో అనుమానిత లక్షణాలు కనిపిస్తాయి. కాస్త జ్వరంగా అనిపించడం, ఆకలి మందగించడం, నీరసం, బరువు తగ్గడం వంటి సర్వసాధారణ లక్షణాలే ఉంటాయి. ఈ లక్షణాలు పెద్దగా పట్టించుకునేలా ఉండవు. దీంతో కేన్సర్‌ను పసిగట్టేలోపే ఇతర భాగాలను కబళిస్తాయి. నిజానికి కేన్సర్లపై కనీస అవగాహన లేకపోవడం, క్రమంతప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోకపోవడం కేన్సర్‌ను గుర్తించలేకపోవడానికి కారణం. సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే ప్రాణాలు కాపాడవచ్చు. మంచి చికిత్స అందిస్తే మమూలు జీవితాన్ని హాయిగా గడిపేయవచ్చు. ఎక్సరే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, బేరియం మీల్ స్టడీ, ఎముక స్కాన్, పెట్ స్కాన్, స్పెక్ట్ స్కాన్, యూఎస్‌జీ, బయాప్సీ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా కేన్సర్‌ని గుర్తించి నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా వ్యాధి లక్షణాలు కనిపించకపోయినా కేన్సర్ కోసం ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే వీలుంది.


కాకినాడ జీజీహెచ్ అంకాలజీలో ఓపీ రద్దీ

● రిస్కుకు దూరంగా ఉండాలంటే..

పొగాకు నమలడం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన బరువు మెయిన్‌టైన్ చేయడంతోపాటు మంచి ఆహారం తీసుకోవాలి. పళ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. యోగా, శారీరక ఎక్సర్‌సైజులు వంటి ఫిజికల్ యాక్టివిటీ నిత్యం ఉండాలి. ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, అల్ట్రా వయిలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ కాకపోవడం, క్రమం తప్పకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా రిస్కుకు దూరంగా ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

● కాకినాడ జీజీహెచ్‌లో సేవలు..

ఉభయగోదావరి జిల్లాలోనే ఆరోగ్య వరప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి నిత్యం వేలాది మంది రోగులు వైద్య సేవలు కోసం విచ్చేస్తుంటారు. ఇక్కడ కేన్సర్ రోగులకోసం రేడియేషన్ అంకాలజీ యూనిట్ ఏర్పాటుచేశారు. రేడియేషన్ అంకాలజిస్ట్ యూనిట్ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో రోగులకు సేవలు అందిస్తున్నారు. కేన్సర్ వార్డుకి నిత్యం 30 మంది రోగులు వైద్య చికిత్సల కోసం విచ్చేస్తున్నారు. నిత్యం 8 నుంచి 10 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా వార్డులో చేరుతున్నారు. 60 పడకల సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఉంది. ఇక్కడకు విచ్చేసిన రోగులకు రేడియోథెరపీ, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. ఇక్కడకు విచ్చేసిన రోగులకు బెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గర్భసంచి, ఓవెరీ, కొలన్ కేన్సర్, సర్కోమా కేన్సర్ వంటి వాటికి చికిత్స అందిస్తున్నారు. అయితే జీజీహెచ్ కేన్సర్ యూనిట్ విభాగంలో వైద్య పరికరాల కొరత ఉంది. లీనియర్ ఎసెలిరేటర్ పరికరం ఉంటే అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అందించే వెసులుబాటు ఉంటుంది. దీని ఖరీదు రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. అలాగే రొమ్ము కేన్సర్‌ని గుర్తించే మామోగ్రామ్ అందుబాటులో లేదు. హైడ్రోఎస్ఆర్ రేట్ బ్రేకేథెరపీ మిషన్ అందుబాటులో లేదు. ఇవన్నీ ఉంటే అడ్వాన్స్‌డ్ కేన్సర్ చికిత్స అందించేందుకు వీలుంటుంది.

ప్రాథమిక దశలో గుర్తిస్తే..



కేన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. కేన్సర్‌పై గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణవాసుల్లోనూ సరైన అవగాహన లేక వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. శరీరంలో అసాధారణ రీతిలో కణితులుంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. కేన్సర్ వ్యాధి నిర్ధారణ కోసం స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుంటే అన్నివిధాలా మంచిది. మద్యపానం, ధూమపానం, వంశపారం పర్యం, ఆహారపు, జీవనశైలిలో మార్పుతో వచ్చే అవకాశం ఉంది. కేన్సర్ రోగులకు జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. రేడియేషన్, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు, మందులు అందిస్తున్నాం. అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం పలు వైద్య పరికరాలు కావాలి. వీటి మంజూరుకోసం సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ద్వారా కలెక్టర్‌కు పంపడం జరిగింది.

- డాక్టర్ పి. శ్రీనివాసన్, హెచ్‌వోడీ, జీజీహెచ్ అంకాలజీ యూనిట్ రేడియేషన్ అంకాలజిస్ట్

● రాజమహేంద్రవరంలో జీజీహెచ్‌లో వైద్య చికిత్సలు

కేన్సర్‌కు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేన్సర్‌కు వైద్యచికిత్సలు అందించే అంకాలజీ స్పెషలిస్టులను నియమించింది. దీంతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సర్జరీ, కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. సర్జరీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక్కడ గత ఆరు నెలల కాలంలో తల, మెడ సంబంధిత కేన్సర్‌లకు సంబంధించి 9 కేసుల్లో, గైనకాలజికల్ సంబంధిత కేన్సర్లు 11, గ్యాస్ట్రో ఇంటెస్టియల్ కేన్సర్లు నాలుగు, స్కిన్ కేన్సర్ ఒకదానికి విజయవంతంగా సర్జరీ చేశారు. అలాగే 60 కీమోథెరపీ వైద్యసేవలు అందించారు. వీటితోపాటు ప్రతినెలా రెండవ బుధవారం కేన్సర్ స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల వారు రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో అందిస్తున్న కేన్సర్ వైద్యసేవలతోపాటు స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ కోరారు. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన బరువుతోపాటు మంచి ఆహారం తీసుకోవాలని, క్రమంతప్పకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్ రిస్కుకు దూరంగా ఉండొచ్చని ఆమె చెప్పారు.


హరి తాడోజు గీసిన డోనాల్డ్ ట్రంప్ తైలవర్ణ చిత్రం

చిత్రం భళారే..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిరోహించబోతున్న డోనాల్డ్ ట్రంప్‌కు అభినందనలు తెలుపుతూ రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు హరి తాడోజు ట్రంప్ తైలవర్ణ చిత్రాన్ని గీసారు. బుధవారం పెయింటింగ్‌ను ఆవిష్కరించి ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 8న నిర్వ హించనున్నామని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటల నుంచి జడ్పీ చైరన్, ఆయా సంఘాల చైర్మన్‌ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. దీనికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

‘ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి’

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత


పీడీజే సునీత అందజేసిన హెల్మెట్లతో న్యాయవాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో విధిగా హెల్మెట్ ధరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్ పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, న్యాయవాదులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేశామన్నారు. హెల్మెట్లు ధరించడంలో అలసత్వంవల్ల తలకు బలమైన గాయాలై మృత్యువాతపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీఎస్ఆర్ కింద బ్యాంకులు, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఏపీ పేపర్‌మిల్ యాజమాన్యాలు అందజేసిన 398 హెల్మెట్లను ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులు, జూనియర్ న్యాయవాదులకు వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్మెట్, సీటుబెల్టు వంటివి ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడతా యని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పి. రమేశ్, ఎస్‌బీఐ ఆర్ఎం టి.శ్రీనివాస్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ జి.రఘుకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్

ఎస్‌హెచ్‌జీపై ఒకరోజు శిక్షణలో మెప్మా పీడీ ప్రియంవద



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెప్మా సంఘం సభ్యుల డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్ దిశగా మెప్మా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పీడీ బి.ప్రియంవద అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో బుధవారం మెప్మా కార్యక్రమాలు డిజిటలైజేషన్ ప్రక్రియపై తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మెప్మా సీవోలు, రిసోర్స్ పర్సన్స్ సిబ్బందికి ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ అప్ లోడింగ్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. సమావేశంలో ప్రియంవద మాట్లాడుతూ పట్టణాల పరిధిలో స్వయం సహాయ సంఘాలు, సమైక్యలు పటిష్టత కోసం వారి పూర్తి సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యుల డేటా అంతా పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరవేసేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పూర్తి సమాచారాన్ని యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘం సభ్యులు, సమైక్యలు వారి జీవన విధానంలో మార్పులతోపాటు మెరుగైన ఉపాధిని కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్లు, టీఎంసీలు, పి.రవిశంకర్, కె.మోహన్ కుమార్, టీ.అనంతలక్ష్మి, డి.మంగాదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘తూర్పు’ డెల్టాలో స్కవర్ స్లూయిస్ ఆపరేషన్



గేట్లను ఎత్తి స్విచ్ ఆన్ చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు

ధవళేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు డెల్టా పరిధిలో బుధవారం స్కవర్ స్లూయిస్‌లో ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. ఉదయం నిర్ణయించిన ముహూర్తం సమయానికి సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు స్కవర్ స్లూయిస్‌లోని నాలుగు గేట్లను ఎత్తి వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో 7వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించినట్టు హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. డి.ఆనంద్‌బాబు, ఏఈ సాయిరాం సునీల్, సిబ్బంది పర్యవేక్షించారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.08 కోట్లు



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు ప్రసాదరాజు, కిరణ్ సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 33 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.84,58,208, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,75,899... మొత్తం రూ.1,08,34,107 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 700 గ్రాములు, విదేశీ కరెన్సీ లభించిందని ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,06,490 వచ్చింది. లెక్కింపులో గ్రామస్తులు, దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు

శలపాకలో ముగ్గురు వ్యక్తుల హత్య కేసులో...

ఐదుగురు అరెస్టు

నిందితులు రిమాండ్‌కు తరలింపు

సర్పవరం జంక్షన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో దీపావళి రోజు రాత్రి ముగ్గురు వ్యక్తులను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కాకినాడ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు వెల్లడించారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక దళితపేటకు చెందిన బత్తుల చిన్నయ్య, అతడి ఇంటి ఎదురుగా నివసిస్తున్న పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబం మధ్య మనస్పర్థలు ఉన్నాయి. దీపావళి రోజైన అక్టోబరు 31వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో బత్తుల చిన్నయ్య, కుమారుడు రమేష్, సోదరుడు రాజును నాగేశ్వరరావు, భార్య బేబీ, ముగ్గురు కుమారులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్ కలిసి ఇనుపరాడ్డు, మంచం పట్టి, కర్రలతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. తీవ్ర గాయాలతో తప్పించుకున్న బత్తుల శ్రీను కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రత్యక్ష సాక్షి, బాధితుడి వాంగ్మూలం మేరకు ఐదుగురు నిందితులను మంగళవారం సాయంత్రం కాకినాడలో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులు కోర్టులో లొంగిపోయేందుకు లాయర్ వద్దకు వెళ్తున్న సమయంలో అరెస్టు చేశారు. వివాహితపై అసభ్య పదజాలంతో దూషించడం, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే నిందితులు దుర్మార్గంగా ముగ్గురిని చంపినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



మండపేటలో దగ్ధమైన కారు ఇదే

పార్కింగ్‌లో పెట్టిన

కారులోంచి మంటలు

మండపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఒక కారు దగ్ధమైంది. వాసవీమాత ఆలయ పార్కింగ్ ప్రదేశంలో బుధవారం సాయంత్రం నిలిపి ఉంచిన ఒక కారు నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే మండపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. కారు ఎందుకు దగ్ధమైంది, అది ఎవరిదనే విషయమై అగ్నిమాపక సిబ్బంది ఆరా తీశారు. కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన శీలం ప్రసాద్‌కు చెందిన కారు (టాటా మాంజా ఏపీ05-6655)గా గుర్తించారు. ఎవరైనా దుండగులు నిప్పుపెట్టారా? లేక సాంకేతికలోపంతో దగ్ధమైందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రూ.1.5 లక్షలు నష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. కారు యజమాని స్టూడియో నిర్వహిస్తాడని, వాసవీ మాత ఆలయ పార్కింగ్ పెట్టి స్టూడియోకి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి హనుమంతరావు తెలిపారు. పార్కులో తీసిన చెత్త పోగుపెట్టి ఉండగా అందులో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి పారేయడం వల్ల మంటలు చేలరేగి కారుకు వ్యాపించి ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య

చికిత్స పొందుతున్న మరో మహిళ మృతి

ఉండ్రాజవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో గత నెల 30న బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి పేలుడు సంభవించిన ఘటనలో చికిత్స పొందుతూ బుధవారం మరొకరు మృతి చెందారు. సంఘటన జరిగిన రోజున ఇద్దరు మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఒక్క రోజే చికిత్స పొందుతున్న వారిలో నలుగురు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు(45) ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. దీంతో ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఐదుగురూ మరణించారు. మృతుల సంఖ్య ఏడుగురికి చేరింది.

మంటల్లో చిక్కుకున్న మహిళ... చికిత్స పొందుతూ మృతి



రాజవొమ్మంగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజు జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళ మంగళవారం రాత్రి మృతి చెందింది. మండలంలోని వాతంగి గ్రామానికి చెందిన గుర్రపల్లి సరస్వతి (55) దీపావళి రోజు కిరాణా షాపు వద్ద మంటల్లో చిక్కుకుంది. కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాట్రేనికోన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొరపొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(20) అక్కడికక్కడే మృతి చెందాడు. అమలాపురం రొయ్యల కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువులతో కలిసి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



ముమ్మిడివరం పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

ముమ్మిడివరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో, డ్రగ్స్, ఆస్తి నేరాలకు సంబంధించి ఇప్పటివరకు తమ రేంజ్‌లో 7,500 కేసులు నమోదు చేశామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. రికార్డులను చూసి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌కు పలు సూచనలిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోక్సో, డ్రగ్స్, ప్రోపర్టీ నేరాలకు సంబంధించి నేరస్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు రేంజ్‌లో ఐదేళ్లలో ఆయా నేరాలకు పాల్పడిన 7,500 కేసులకు సంబంధించి నిందితుల వివరాలు నమోదు చేసి వారి డేటా, వేలిముద్రలు, ఫొటోలను నిక్షిప్తం చేశామన్నారు. ప్రోపర్టీ నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను గుర్తించేందుకు నిరంతర నిఘా పెట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను మరో నెల కొనసాగిస్తున్నట్టు తెలిపారు. మహిళా రక్షణకు సంబంధించి ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా పోలీసులు, మెన్ పోలీసులు, సచివాలయ పోలీసులతో కలిసి ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి ఈవ్‌టీజింగ్‌లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నామని... సోషల్ మీడియా వల్ల ప్రభావితమైయువత నష్టపోతున్నారని, వారికి కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రత్యేక ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచామని, నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేనివారు, ఆ నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యను నిర్భయంగా చెప్పవచ్చన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి స్కూటర్లపై 10, 15 కిలోలు తీసుకువచ్చి లూజు విక్రయాలు జరుపుతున్నారన్నారు. వారిపై నిఘా ఏర్పాటుచేసి కేసులు పెడుతున్నామని, అవసరమైతే పీడీ యాక్టు కూడా నమోదు చేస్తామన్నారు. అనాతవరంలో 2022లో జరిగిన పెదపూడి రవికుమార్ హత్య కేసును, 2023లో జరిగిన షేక్ శామ్యూల్ బాషా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను గుర్తించేందుకు అమలాపురం డీఎస్పీతో చర్చించామని చెప్పారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసే ఫ్లెక్సీల వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, తద్వారా సమాజంలో అందరూ నష్టపోతున్నామన్నారు. దీనిపై ప్రజల్లో అవేర్‌నెస్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్లెక్సీల వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని, ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయకుండా చూడాలని ఎస్పీలకు ఆదేశాలిచ్చామన్నారు. ఏదైనా ప్రత్యేక సందర్భాల్లో ఫ్లెక్సీలు పెట్టవలసి వస్తే ఉదయం కట్టి సాయంత్రం తీసివేసేలా గ్రామపంచాయతీలకు సూచనలిచ్చామన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరుల సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

మా కుమార్తె ఆచూకీ తెలపండి

కళాశాల నుంచి అదృశ్యమై 16 రోజులు గడుస్తోంది... పోలీసులు, కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోతే ఎవరిని ఆశ్రయించాలి



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ-నూకరత్నం దంపతులు

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ‘ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మా కుమార్తె అదృశ్యమైంది. 16 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా, కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా మా గోడు పట్టించుకున్న వారే లేరు. బిడ్డ బతికి ఉందో లేదో తెలియని అయోమయ పరిస్థితి. దయచేసి మా బిడ్డ ఆచూకీ తెలపండి’ అంటూ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన నెల్లి నూకరత్నం-రామకృష్ణ దంపతులు బుధవారం ప్రత్తిపాడులో విలేకరుల ఎదుట తమ గోడు వినిపించారు. తమ కుమార్తె ప్రత్తిపాడులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. కళాశాలకు వెళ్లి వచ్చే సమయంలో కొడవలికి చెందిన బొడ్డు జాన్ అనే వ్యక్తి వేధించేవాడని తెలిపారు. సెప్టెంబరు 6న అతడు తమ ఇంటికి వచ్చి కుమార్తెపై అత్యాచారయత్నానికి పాల్పడడంపై గొల్లప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు. అక్టోబరు 22న తమ కుమార్తెను కళాశాల నుంచి జాన్ తీసుకెళ్లిపోయాడని ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అదృశ్యమై 16 రోజులైనా ఎవరూ పట్టించుకోవట్లేద ని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలుగజేసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.



కడియం దేవీచౌక్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

నినదించిన ప్రజా సంఘాలు

కడియంలో కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

కడియం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో వివాహితపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, శ్రామిక మహిళ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడియం బస్టాండు నుంచి దేవీచౌక్ సెంటర్ వరకు బుధవారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నర్సరీల్లో పనిచేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, మహిళలు, చిన్నారుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి డిమాండ్ చేశారు. బాధిత మహిళ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వారికి ఉన్న మానసిక వికలాంగురాలైన కుమార్తె బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మద్యం, పోర్న్ వంటివి పూర్తిస్థాయిలో నిషేధించాలన్నారు. ప్రదర్శనలో యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, యూటీఎఫ్ నాయకులు అనిత, రాజేశ్వరి, పార్వతి, చిలుకూరి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా, సీనియర్ నాయకులు సావిత్రి, అంగన్వాడీ నాయకురాళ్లు సుజాత, వెంకటలక్ష్మి, మేరీ, సత్యవతి, సుబ్బలక్ష్మి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగమణి, పద్మ, సీఐటీయూ నాయకుడు పూర్ణిమరాజు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ల వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 11న కలెక్టరేట్‌ల ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేస్తారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడిసరుకుల అధిక ధరలను నియంత్రించాలన్నారు. బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని కోరారు. 11వ తేదీన అన్ని రంగాల కార్మికులు పనులు నిలుపుదల చేసి కలెక్టరేట్‌కు తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉదయ్ శ్రీనివాస్

ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న 79వ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ ఏడాది భారతదేశం నుంచి 9 మంది యువ ఎంపీలను ఆహ్వానించగా అందులో ఉదయ్ శ్రీనివాస్‌కు అవకాశం దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన మొట్టమొదటి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కావడం గమనార్హం. ప్రతిష్ఠాత్మక ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఉదయ్‌శ్రీనివాస్‌ను కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. మేధావుల సూచనలు, సలహాలతో రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

‘నన్నయ’లో నేడు సాంస్కృతిక వైభవం సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి ‘ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం’ సదస్సు నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) మధ్య జరిగిన ఎంవోయూలో భాగంగా కామర్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవ సభకు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ హాజరవుతారు. 8వ తేదీన జరిగే ముగింపు సభకు మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరవుతారు. సదస్సులో ప్రధానంగా మన రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్రాలను సమర్పిస్తారు. సాంస్కృతిక వైభవం ప్రతిబింబించే విధంగా అందరి కృషితో సదస్సును విజయవంతం చేయాలని వీసీ శ్రీనివాసరావు కోరారు.



నీలాపు రేష్మ

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు

రేష్మ ఎంపిక

అమలాపురం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని నీలాపు రేష్మ ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదికవి నన్నయయూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాక్సింగ్ పోటీలు పెనుగొండ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన రేష్మ స్వర్ణ పతకం దక్కించుకుంది. డిసెంబరు 26 నుంచి పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో రేష్మ పాల్గొంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్‌తో పాటు పలువురు ఆమెను అభినందించారు.

పిల్లంకలో రీసర్వే గ్రామసభ

తాళ్లరేవు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లంక గ్రామ పంచాయతీలో బుధవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. పిల్లంక, కొత్తలంక గ్రామాల రైతులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మహ్మద్ సఫీ, కార్యదర్శి వల్లీబాబు, టీడీపీ నేత ఉంగరాల వెంకటేశ్వరరావు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల సహకారం అవసరం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సీబీ దేవం గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పారిశ్రామికవేత్తల సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని సీబీ దేవం గ్రామంలో కేబీకే బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సహకారంతో గ్రామంలో నిర్మించనున్న కల్యాణమండప నిర్మాణానికి జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలసి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు సమీప గ్రామాలను దత్తత తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలన్నారు. ప్రతీ ఒక్క పారిశ్రామికవేత్త గ్రామాల అభివృద్ధిని తమ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సీబీ దేవం గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న కేబీకే బయోటెక్ యాజమాన్యాన్ని వారు అభినందించారు. కేబీకే బయోటెక్ పరిశ్రమ ఛైర్మన్ కుందుల బలరామకృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ టీడీపీ నాయకులు ఆచంట వెంకట్రాజు, గంగాధర్, కంచుమర్తి కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం ఆధ్వర్యంలో 'ప్రజా పోరు'



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 8 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా పోరు కార్యక్రమం కరపత్రాన్ని సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ పాలకులు దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. మద్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు చేతనైతే బియ్యం, నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు మాట్లాడుతూ ఈనెల 8 నుంచి వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుస్తూ సమస్యలు తెలుసుకుంటామన్నారు. 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరతామన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, సీహెచ్ రమణి ఉన్నారు.

రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం : ఏడీ స్వాతి



జల్లూరులో మాట్లాడుతున్న ఏడీ స్వాతి

పిఠాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సార్వా సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి తెలిపారు. పిఠాపురం మండలం జల్లూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రబీ సీజన్ నుంచి నూతన బీమా విధానం అమలవుతున్నదన్నారు. పంటపొలాలు పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు పాల్గొన్నారు.

క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు విజయవంతం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): క్లిష్టతరమైన రెండు శస్త్రచికిత్సలను కాకినాడ జీజీహెచ్ ఆర్థో వైద్యులు బుధవారం విజయవంతంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడుకు చెందిన 42ఏళ్ల వాసంశెట్టి అప్పారావుకు రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు తొడ ఎముక మోకాలు వద్ద భాగంలో పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. అనంతరం అప్పారావు నడకలో తేడా, విపరీతమైన బాధ, ఇబ్బంది రీత్యా జీజీహెచ్ ఆర్థో విభాగాన్ని ఆశ్రయించాడు. ఈ క్లిష్టతరమైన శస్త్రచికిత్సను హైబ్రీడ్ ఇలిజరోవ్ టెక్నిక్‌ను ఉపయోగించి అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ సహకారంతో డాక్టర్ విఠల్ బృందం విజయవంతంగా నిర్వహించింది. ఇదే తరహా శస్త్రచికిత్సను ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో, ఇదే వైద్యబృందం మరొకరికి కూడా బుధవారం విజయవంతంగా నిర్వహించింది. శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ రాజు అయ్యంగార్, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ముఖర్జీ, డాక్టర్ కేతన్‌కుమార్, డాక్టర్ రాంకిషోర్, డాక్టర్ నవ్య, డాక్టర్ నిరూపలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 18మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహరావు జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎన్.రమేష్ డి.రామారావు తమ బృందాలతో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 18మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికీ రెండురోజుల చొప్పున జైలు శిక్ష, మిగతా 12మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు

ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు

పిఠాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో 3 రోజుల పాటు జరిగిన కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రీమియం క్రికెట్ లీగ్ పోటీలు బుధవారం ముగిశాయి. రెండు జిల్లాల పరిధిలోని పది భాష్యం పాఠశాలలు పాల్గొన్న ఈ క్రికెట్ పోటీల సీనియర్స్ విభాగంలో కాకినాడ శశికాంతనగర్ స్కూలు ప్రథమస్థానంలో నిలవగా, రామచంద్రపురం రన్నర్ అప్‌గా, జూనియర్స్ విభాగంలో జగ్గంపేట, తుని పాఠశాలలు విన్నర్, రన్నర్స్‌గా నిలిచారు. విజేతలు జనవరిలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్ చార్జి వి.గోవిందరాజులు, పిఠాపురం ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ సత్యనారాయణ, భాస్కర్, శ్రీనివాసగుప్తా, దివాకర్, సూర్యారావు, అనురాధ తదితరులు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు



విశేష అలంకారంలో స్వామివారు

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలను పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. లక్షపత్రి పూజలలో నరేంద్రపురానికి చెందిన అయ్యగారి కామేశ్వరరావు దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజలు, కార్తీకదీ పారాధన సంఘ సభ్యులచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై కొనసాగుతున్న విచారణ

కాకినాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో ఆయనపై పలువురు ఫిర్యాదుచేయగా కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి సంబంధిత బృందం నిర్వహిస్తున్న విచారణ బుధవారం కూడా కొనసాగింది. అయితే ఈ కళాశాలలో గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బంధువు పెత్తనం ఎక్కువగా ఉండడం, దానికి ప్రిన్సిపాల్ సహకరించడం అంతే కాకుండా ఎయిడెడ్ కళాశాల ఉంచి వచ్చిన ఒక అధ్యాపకుడికి సీఈ పోస్టును కట్టబెట్టి నిబంధనలకు విరుద్ధంగా పరీక్షల విభాగంలో వ్యవహరించడం జరిగింది. ఈ విధంగా ప్రిన్సిపాల్‌పై వచ్చిన ప్రతీ ఫిర్యాదులోనూ పేర్కొన్న అంశాలు, సమస్యలపై అధికారుల బృందం చాలాలోతుగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. విచారణ గురువారం కూడా కొనసాగుతుందని సమాచారం. ఎంతో ఘన చరిత్ర కలిగిన పీఆర్ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ హయాంలో ఈ విధంగా సమస్యల కేంద్రంగా మారడం పట్ల విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు, కూటమి నేతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కళాశాల ప్రిన్సిపాల్‌పై కూటమి నేతలు విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

అస్తవ్యస్తంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

మెట్ల కింద చెత్త పోగులు

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు





కాంప్లెక్స్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, మెట్ల మార్గం వద్ద పేరుకుపోయిన చెత్త

పెద్దాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో మున్సిపల్ జంక్షన్ వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. భవనంపై పిచ్చి మొక్కలు పెరిగిపోయి భవనానికి పగుళ్లు ఏర్పడుతున్నాయి. అలాగే భవన సముదాయం ప్రారంభంలో మెట్ల కింద చెత్త పోగులు పేరుకు పోయాయి. అలాగే విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. భవన సముదాయ నిర్వహణ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతుంది. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని దుకాణాల నిర్వాహకులు, ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు సొంత భవనాల్లోకి..

విద్యార్థుల ఆనందోత్సాహాలు



గొల్లప్రోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనంలోకి వచ్చిన విద్యార్థులు

గొల్లప్రోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలో గల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ తరగతి గదుల్లోకి బుధవారం వచ్చిన విద్యార్థుల ఆనందానికి అంతు లేకుండాపోయింది. కొత్త తరగతి గదులు, నూతన బెంచీలు చూసి వారు మురిసిపోయారు. గొల్లప్రోలు పట్టణంలోని పాపయ్యచావిడి రామకోవెల సమీపంలో ఉన్న మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబరు-2 భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించి నాడు-నేడు కింద నూతన భవనాలను వైసీపీ హయాంలో నిర్మించారు. అయితే పనులు పూర్తి చేయకపోగా, ఫర్నీచర్ ఇతర సౌకర్యాలు కల్పించలేదు. దీంతో గత ఐదేళ్లుగా ఈ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లోని ఒక తరగతి గదిలోనే సర్దుకుని విద్యను అభ్యసించాల్సి వచ్చేది. వరండాల్లో తరగతులు నిర్వహించారు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన ఓఎస్‌డీ మధుసూదన్‌ను పంపించి పాఠశాలల పరిస్థితులపై పరిశీలన చేయించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పవన్ తక్షణం స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. కలెక్టర్ సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయడంతో పాఠశాల నూతన భవనాలకు రంగు వేయడంతో పాటు ఫర్నీచర్, ఇతర సౌకర్యాలను కల్పించారు. సోమవారం ఈ పాఠశాల భవనాలను పవన్ ప్రారంభించగా బుధవారం విద్యార్థులను తరగతి గదుల్లోకి పంపారు. విశాలమైన తరగతి గదులు, ఫర్నీచర్ ఇతర సౌకర్యాలు చూసి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. పవన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వినియోగదారులకు మరిన్ని సేవల విస్తరణ

కాకినాడ సూపర్‌బజార్ ఛైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్

కాకినాడ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరిన్ని సేవల విస్తరణలో భాగంగా గతంలో రైతుబజార్‌లో ఉన్న సూపర్ బజార్ స్టాల్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు, డైరీఫారమ్ రాజీవ్‌గృహకల్ప, జగన్నాథపురం మెయిన్‌రోడ్‌ల్లో రెండు నూతన స్టోర్స్ ఏర్పాటు చేసేందుకు పాలకవర్గం నిర్ణయించినట్లు కాకినాడ సూపర్‌బజార్ ఛైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ వెల్లడించారు. కాకినాడ మెయిన్‌రోడ్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం సూపర్ బజార్ పాలకవర్గ సమావేశం ఛైర్మన్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. అనంతరం ఛైర్మన్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు తెలిపారు. కాకినాడ మెయిన్‌రోడ్ లోని ప్రధాన సముదాయంలోని సూపర్‌బజార్ ఫార్మసీ స్టోర్ వద్ద ఒక వైద్యుడిని అందుబాటులో ఉంచి తమ సహకార వినియోగదారులకు ఆరోగ్య సేవ చేసేందుకు నిర్ణయించామన్నారు. సమావేశంలో సంస్థ సీఈవో వి.శివాజీ గణేష్, వైస్ ఛైర్‌పర్సన్ వరిపల్లి కృష్ణవేణి, డైరెక్టర్లు మన్నే నాగేశ్వరరావు, యాళ్ల పట్టాభిరామయ్య, బత్తిన పైడిరాజు, ముమ్మిడి వపన్‌కుమార్, డీవీవీ ప్రసాద్, బి.బాలకృష్ణ, డీఆదినారాయణ ఉన్నారు.

కాజ్‌వే మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటకృష్ణరాయపురం గ్రామ శివారు ఏలేరు కాలువపై కాజ్‌వే పూర్తిగా శిథిలమై పొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను గ్రామంలోకి తెచ్చుకునేందుకు వీలులేని పరిస్థితులు నెలకొన్నందున సత్వరం కాజ్‌వే తాత్కాలిక మరమ్మతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సిందిగా గ్రామ పంచాయతీ ఇంచార్జి సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రానారాయణ స్వామి(రాజు)తదితర రైతులు కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. సుమారు 5 వేల ఎకరాలకు చెంది ధాన్యాన్ని గ్రామానికి పొలాల నుంచి రవాణా చేయాలంటే ఈ కాజ్‌వే ద్వారానే సాధ్యపడుతుందని వివరించారు. కలెక్టర్ నుంచి సానుకూలరీతిలో స్పందన లభించిందని, 2రోజుల్లో పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు శిథిల కాజ్‌వే పరిశీలించేందుకు, నిర్మాణ వ్యయాన్ని అంచనాలు తయారుచేసేందుకు రానున్నారని సర్వేశ్వరరావు, కుర్రా రాజులు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వీవోఏల నిరసన



కరపలో నిరసన తెలుపుతున్న వీవోఏలు

కరప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు యానిమేటర్లు (వీవోఏలు) కరపలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మండల మహిళాసమాఖ్య కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం మండలాధ్యక్షురాలు సాధనాల పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాలపరిమతి సర్క్యులర్‌ను వెంటనే రద్దుచేయాలన్నారు. మూడు సంవత్సరాలకు యానిమేటర్లను తొలగించుకునే అవకాశం ఉందని ఇటీవల రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలతో వీవోఏల్లో ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. యానిమేటర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఎక్కువయ్యాయన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వచ్చే రెండు రోజులు ర్యాలీలు, ధర్నాలు నిర్వహించి ఎంపీడీవో, తహశీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు ఉధృతంచేస్తామని స్పష్టంచేశారు. అనంతరం వెలుగు ఏపీఎం ఎంఎస్ బాలాదేవికి వినతిపత్రం అందజేశారు. సంఘ సభ్యులు రొక్కాల సత్యవతి, మారెళ్ల లక్ష్మి, మందపల్లి శ్రీలక్ష్మి, యాళ్ల వెంకటలక్ష్మి, కె.నాగమణి, బత్తుల భవానీ, నౌడు భవానీ, సత్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సత్కారం



కాకినాడ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అండర్-14 బాస్కెట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన పెదపూడి మండలం గండ్రేడు గ్రామానికి చెందిన క్రీడాకారిణి చింతపల్లి భువనేశ్వరిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ పోటీల ఎంపికలకు పీఎంశ్రీ బాయ్స్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే..

అనపర్తి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించాలని టీడీపీ నాయకుడు గంటారాజు మొక్కుకున్న సందర్భంగా బుధవారం గండ్రేడు గౌరీదేవి సంబరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించారు.

'ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అవకాశం'

కరప, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అవకాశం కల్పించారని, అర్హులైన గ్రాడ్యుయేట్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కరపమండలం అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జడ్.బావారం, కొరుపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి పలువురికి ఓటు నమోదు ఫారమ్‌లు అందజేశారు. పూర్తిచేసిన దరఖాస్తులు, ఇతర కాపీలు గ్రాడ్యుయేట్‌ల నుంచి స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 2021 అక్టోబరు ముందు డిగ్రీ పూర్తిచేసిన వారందరూ తమ ఓటును నమోదుచేసుకోవచ్చన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మద్దతుగా నిలవాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, బెంజిమన్ రాజు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'మద్యం దుకాణాన్ని మూయించాలి'

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద బ్రహ్మదేవం గ్రామంలో ప్రధాన కెనాల్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం బెల్ట్ దుకాణాన్ని సత్వరం మూయించాలని, గ్రామంలో ఎక్కడా మద్యం బెల్ట్ దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సర్పంచ్ నీలపాల సత్యనారాయణ అధ్యక్షతన పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. పంచాయతీ సభ్యుల మధ్య పరస్పరం వాగ్వివాదం జరగగా ఈ పరిణామలపై ఎంపీడీవో హిమమహేశ్వరికి పంచాయతీ కార్యదర్శి శ్రీహరి సమగ్ర నివేదిక అందజేశారు.

పాదగయలో మహిళా అఘోరి పూజలు



పాదగయ క్షేత్రంలో మహిళా అఘోరి

పిఠాపురం, నవంబరు 6: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని మహిళా అఘోరి బుధవారం సందర్శించారు. తెలంగాణ, ఉత్తరాంధ్రలో హల్‌చల్ చేసి సంచలనం సృష్టించిన నాగసాధు మహిళా అఘోరి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. సనాతన ధర్మం, మహిళల రక్షణ లక్ష్యంగా ఈ పర్యటన చేస్తున్నట్లు అఘోరి తెలిపారు. అఘోరిని చూసేందుకు భక్తులు, స్థానికులు భారీగా తరలివచ్చారు.

కొవ్వాడలో అగ్నిప్రమాదం



మంటల్లో దగ్ధమైన కారు, స్కూటీ

కాకినాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కొవ్వాడలో మంగళవారం అర్ధరాత్రి శ్రీనిలయం డోర్ నెంబర్ 1-79 ఇంటి భవనంలో ఒక్కసారిగా మంటలు ఉవెత్తున ఎగిసిపడ్డాయి. ఇంటి యజమాని భార్యతో కలిసి కొన్ని రోజుల క్రితం అమెరికాలోని కుమారుడి వద్దకు వెళ్లారు. దీంతో స్థానికులు సాలిపేటలోని అగ్నిమాపక స్టేషన్‌కు ఫోన్‌చేయగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపుచేశారు. సుమారు రూ.3.50 లక్షలు వరకూ నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖాధికారి వి.సుబ్బారావు తెలిపారు. అయితే ప్రస్తుతం ఏవిధమైన ఆధారాలు లభించలేదని, దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

'ప్రజా సమస్యలపై పోరాటం'

పిఠాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తెలిపారు. పిఠాపురం రెడ్డిరాజా కల్యాణమండపంలో బుధవారం జరిగిన నియోజకవర్గస్థాయి వైసీపీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమతెరల వినియోగంపై అవగాహన



చినజగ్గంపేటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు దోమతెరల వినియోగంపై వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. దోమల వల్ల వ్యాప్తి చెందే జ్వరాలు, ఇతర వ్యాధులు రాకుండా ఉండేందుకు దోమతెరలను వాడాలని గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో బుధవారం ఇంటింటా తిరిగి వారు సూచించారు. మైగ్రేషన్ పాపులేషన్ సర్వే నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తుల అందజేత



దరఖాస్తులు అందిస్తున్న టీడీపీ నేతలు

తాళ్లరేవు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియకు బుధవారం టీడీపీనేతలు టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబుల ఆధ్వర్యంలో 300 దరఖాస్తులను డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.సూరిబాబుకు అందించారు. మండలంలోని అన్నిప్రాంతాల నుంచి దరఖాస్తులను జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయానికి అందించారు. అత్తిలి బాబూరావు, బండారు దొరబాబు, మోర్త భైరవమూర్తి, వడ్లమూరి సతీష్, శ్రీనివాస్, హేమలత తదితరులున్నారు.

హార్మోన్స్ మెషీన్ ప్రారంభం



కాకినాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో బాదం సత్యనారాయణమూర్తి, సావిత్రి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు బాదం శ్రీనివాస్‌లక్ష్మి దంపతులు సమకూర్చిన రూ.8లక్షల విలువైన ఫుల్లీఆటోమేటెడ్ హార్మోన్స్ పరీక్షల మెషీన్‌ను బుధవారం ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పరికరంతో థైరాయిడ్, విటమిన్స్ కార్డియాక్, రూబెల్లా తదితర 211 రకాల రక్తపరీక్షలను చాలా వేగవంతంగా మెరుగైన ఫలితాలతో ఎక్కువ మందికి సేవలందించవచ్చన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు బాదం బాలకృష్ణ, సుందరరావు, నాగేశ్వరరావు, సురేంద్రబాబు, స్వామి, వెంకటనారాయణ, సుబ్రహ్మణ్యం, రమణమూర్తి ఉన్నారు.

స్లాబ్ రాళ్ల తొలగింపు

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో దుకాణసముదాయాల వెంబడి ఉన్న మురుగుకాలువలను ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడమే గాక కాలువలో చెత్త చెదారాలను తొలగించే వీలు లేని పరిస్థితులు కల్పించడంపై మున్సిపల్ పారిశుధ్య అధికారులు స్పందించి బుధవారం ఆక్రమణలను తొలగించారు. 2రోజులుగా కాలువలో మురుగునీరు ప్రవహించకుండా రోడ్డుపైకి చేరి దుర్వాసన వస్తుండగా పారిశుధ్య అధికారులు ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. స్టేషన్ సెంటర్లోని పాత బార్ దుకాణం నుంచి అన్న క్యాంటీన్ రోడ్డు వరకూ కాలువపై ఆక్రమణ స్లాబ్ రాళ్లను తొలగించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పనులను కౌన్సిలర్ పితాని కృష్ణ, టీడీపీ నేతలు పర్యవేక్షించారు.

మెగా రక్తదాన శిబిరం


కాకినాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం పురస్కరించుకుని రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో కాకినాడ సరస్వతీ సౌధం క్యాంపస్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.హరిప్రసాద్ ప్రారంభించగా సుమారు 100 మంది కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రక్తదానం చేసారు. కార్యక్రమంలో కాకినాడ జోన్ ఏజీఎం రాంబాబు, డీన్ శ్రీనివాస్, ఆర్ఐలు గోపీనాధ్,శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మణికంఠస్వామి పాల్గొన్నారు.

'విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు'

జగ్గంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వీరభద్రరావు హెచ్చరించారు. మండలం పరిధిలో విద్యుత్ లైన్ల నుంచి ఎవరైనా జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చి ఏ విధమైన ప్రాణహాని కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



పథకంలో నీటిని ఫిల్టర్ చేసే సంపు, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న పంపు ఆపరేటర్లు

మొరాయించిన ట్రాన్స్‌ఫార్మర్

గోగుబాక మంచినీటి పథకానికి బ్రేక్
12 గ్రామాలకు పది రోజులుగా నిలిచిన మంచినీటి సరఫరా
మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ఎటపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగుబాక మంచినీటి పథకం పది రోజులుగా పనిచేయట్లేదు. దీంతో సుమారు 12 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. గోగుబాక మంచినీటి పథకం ద్వారా నెల్లిపాక నుంచి రాంగోపాలపురంతో పాటు నందిగామ వరకు గోదావరి నీరు సరఫరా అవుతుంది. పది రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. ఈ సమస్యను వారం రోజులుగా విద్యుత్ శాఖ అధికారుల దృష్టి తీసుకెళ్తున్నా వారి నుంచి ఎటువంటి స్పందన లేదని పంపు ఆపరేటర్లు వాపోతున్నారు. తమవల్ల ఏమైనా అవుతుందోనని ఆపరేటర్లు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నం చేసి వదిలేశారు. కాగా పది రోజులుగా తాగునీరు లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ పి.సత్యంను వివరణ కోరగా... సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు.



తాళాలు వేసి ఉన్న నూతన సచివాలయ భవనం, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న పాత భవనం

ఏడాదైనా మోక్షం లేదు!

లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు వృథాగా...

రాజవొమ్మంగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాతంగి సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను గత ఏడాది నవంబరులో అప్పటి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అట్టహాసంగా ప్రారంభించారు. అధికారుల నిర్లక్ష్యమో, పాలకులు పట్టించుకోకపోవడమో తెలియదు.. నేటికీ అవి వినియోగంలోకి రాలేదు. రూ.62.50 లక్షలతో నిర్మించిన భవనాలను అధికారులు వదిలేశారు. శిథిలావస్థలో ఉన్న భవనంలోనే సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలందిస్తున్నారు. విద్యుత్ మీటరుకు దరఖాస్తు చేయగా ఆ శాఖ అధికారులు ఇంకా వేయలేదని, దీంతో పాత భవనంలోనే ఉన్నామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

కాగా సచివాలయ భవనం ప్రారంభించిన నాడు అప్పటి ఎమ్మెల్యే ధనలక్ష్మి పుట్టినరోజు కావడంతో అందులో వైసీపీ నేతలు విద్యుద్దీపాలంకరణలతో వేడుకలు నిర్వహించారు. ఆ తర్వాత ఆ భవనానికి తాళాలు వేసి వదిలేశారు. ఏడాది కావస్తున్న మరలా అటువైపు చూసిన దాఖలాలు లేవు.


సచివాలయ నూతన భవనంలో అప్పటి ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక (పాత చిత్రం)


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

అర్జీల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

రంపచోడవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను పరిష్కరించేలా తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. బుధవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీ, ఏపీవో(జీ) డీఎన్‌వీ రమణలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల, పెండింగ్ అర్జీల వివరాలను వివిధ శాఖల అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్లో పొందుపరుస్తామని, సంబంధిత అధికారులకు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కారం చేయని అర్జీలకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో అందిన సమస్యలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీలకు చెందిన విగ్రహాలను మూసివేయాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టరు జాన్‌రాజ్, డిప్యూటీ డైరెక్టరు షరీఫ్, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, పీఏవో ఎల్.రాంబాబు, కె.సావిత్రి, సీడీపీవో సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి, మంత్రులపై అనుచిత పోస్టులపై ఫిర్యాదు

ఎటపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనిత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లపై 'ఎక్స్' వేదికగా సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలతో మార్ఫింగ్ ఫొటోలతో పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తపై బుధవారం ఎటపాక, డొంకరాయి పోలీస్ స్టేషన్లలో టీడీపీ నాయకుడు పాటి సంపత్ మంగళవారం ఫిర్యాదు చేశాడు. సదరు వ్యక్తిపై న్యాయ సంహిత, సైబర్ చట్టాల్లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు ఎటపాక సీఐ ఎం.కన్నపరాజు తెలిపారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకుడు సంపత్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సచివాలయాల వద్ద అధ్వాన పరిస్థితి

రౌతులపూడిలో మురికినీరు, చెత్త కుప్పలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


సచివాలయం1 వద్ద చెత్త కుప్ప


సచివాలయం2 వద్ద అధ్వానంగా ఉన్న దారి

రౌతులపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో 2 సచివాలయాల వద్ద అధ్వాన పరిస్థితి ఉంది. సచివాలయం1 సమీపంలో చెత్తకుప్పలు దర్శమిస్తుండగా, సచివాలయం2 వద్ద మురికినీరు నిల్వ ఉంటుంది. సచివాలయం2 దారిలో బురద, మురికినీరు దాటుకుని ప్రజలు వెళ్లాల్సి వస్తుండగా, సచివాలయం1 వద్ద ముక్కు మూసు కోవలసిన పరిస్థితి. పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు పాలన అందించే సచివాలయాల వద్దే ఇలా ఉంటే ఇంకా గ్రామంలో పాలన ఎలా ఉందో అధికారులకే తెలియాలంటూ పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి మురికినీరు, చెత్తకుప్పలు తొలగించాలని కోరుతున్నారు.

8న అన్నవరంలో ఐలాజ్ రాష్ట్ర మహాసభలు

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలో ఐలాజ్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఐలాజ్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు వద్ద ఐలాజ్ సభ్యులు, న్యాయవాదులు డిసెంబరు 8న అన్నవరంలో జరిగే ఐలాజ్ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర కన్వీనర్ బుగతా శివ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఐలాజ్ పోరాటాలు చేస్తుందని న్యాయవాదులపై దాడులకు వ్యతిరేకంగా ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించాలని జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం ఇవ్వాలని, 60 ఏళ్లు పైబడిన న్యాయవాదులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్నవరం మహాసభలు అనంతరం డిసెంబరు 21,22 తేదీల్లో ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో రెండో జాతీయ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో సభ్యులు అవసరాల దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి మధుబాబు, సీనియర్ న్యాయవాదులు ఆడారి సుగుణ, బండారు నరసింహారావు, పైలా బోస్, రామశెట్టి సత్యనారాయణ, ప్రతాప్, సురేంద్ర, శివప్రసాద్,కిషోర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పర్యటన

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులూరులో బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పర్యటించారు. గ్రామంలో పలు సమస్యలు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆమె పంచాది చంటిబాబు కుటుంబాన్ని పరామర్శించారు. చంటిబాబు కుమార్తె ఇటీవల మృతిచెందడంతో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పంచాది వీరబాబు, పసల సూరిబాబు, బోగాడ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు పని చేస్తాం


జగ్గంపేటలో మాట్లాడుతున్న సీఐ

జగ్గంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సుమారు 180 మంది అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో జగ్గంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా రక్షక్ మొబైల్ నెంబర్ అందరి వద్ద ఉండాలని, ఏ సమస్య వచ్చినా 9494933233 కు ఫోన్ చేస్తే స్పందిస్తామని, నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అమ్మాజీ బూసమ్మ, కరి మున్నీషా, నాగపర్వతి, మహిళా పోలీస్ నాగమణి పాల్గొన్నారు.

మహిళా రక్షక్‌పై అవగాహన

కోటనందూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని బొద్దవరం హైస్కూల్‌లో విద్యార్థినులకు మహిళా రక్షక్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. యువతులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవిఅర్‌కె రాజు, నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'


కోటనందూరు: వివరిస్తున్న ఏవో చంద్రశేఖర్

కోటనందూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కాకరాపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించేందుకు ప్రణాళికలు చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో శివకుమారి, సురేష్, సామినీడి కృష్ణార్జున, వాసం మణిబాబు, పెనుముచ్చు గణేష్, పెనుముచ్చు ప్రవీణ్, వాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: జీవన ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల ఏవో అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తుని మండలంలో సుభద్రయ్యపేట, మరువాడ గ్రామాల్లో రైతులకు జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఎకరానికి 100 కిలోల చిలికిన పశువుల ఎరువుల్లో 3 కిలోల సుడోమోనాస్ మందును కలిపి చెట్టు నీడలో 6రోజులు ఉంచి ప్రతి రోజునీళ్ళు చిలకరించాలని తద్వారా పంటలకు తెగుళ్లు సోకకుండా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి విజయలక్ష్మి, వ్యవసాయ సహాయకులు లోవరాజు ఉన్నారు.


శంఖవరం: పత్తిపంట పరిశీలిస్తున్న అధికారులు

శంఖవరం: రైతులు పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలని మండల ఏవో పి.గాంధీ అన్నారు. అచ్చంపేట, గౌరంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో భాగంగా జీడిమామిడి తోటలకు బ్యాంక్‌లో లోన్‌లేని రైతులు ఎకరాకు రూ.1500 చెల్లించి ఈ పథకంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 15లోపు గడువు ముగుస్తుందని, రైతులు గ్రామాల్లో రైతు సేవాకేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఏఈవో శ్రీనివాస్, క్రాంతి, సువర్ణరాజు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

జగ్గంపేట సీహెచ్‌సీని సందర్శించిన తుమ్మలపల్లి


సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న తుమ్మలపల్లి

జగ్గంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుర్రప్పాలెం రోడ్డులోని సీహెచ్‌సీని బుధవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తమ్మలపల్లి రమేష్ సందర్శించారు. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలో క్షతగాత్రులు హాస్పటల్‌కి వస్తే వైద్యం అందించేందుకు డాక్టర్లు లేకపోవడంపై ఆరా తీశారు. హాస్పటల్‌లో సమస్యలను డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. తుమ్మలపల్లి మాట్లాడుతూ సీహెచ్‌సీలో వైద్యులు సమస్యను వైద్యాధికారులు, కలెక్టర్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో సూరపు రెడ్డి నరేష్, రాజనాల శ్రీను, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మాదారపు వీరబాబు, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గోకవరం మండలం గోకవరం పరిధిలో ఉన్న వీరలంకపల్లి గ్రామంలో సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల పాఠశాలను తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు.

సత్యదీక్షలు స్వీకరణ


ఏలేశ్వరంలో దీక్షలు స్వీకరించిన భక్తులు

ఏలేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం శ్రీసత్యనారాయణస్వామి సత్యదీక్షలను భక్తులు స్వీకరించారు. బుధవారం ఏలేశ్వరం శ్రీఅనంత లక్ష్మీసమేతశ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో సుమారు 89 మంది స్వీకరించారు. ముందుగా పురోహితులు పోన్నూరు సత్యనారాయణ, నరసింహాచార్యులు ఆలయంలోపంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి మాలధారణ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపాలకృష్ణ, నల్లమిల్లి కృష్ణబాబు పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లి మండలం మల్లేపల్లిలో 25మంది భక్తులు సత్యదీక్షలు చేపట్టారు.


మల్లేపల్లిలో దీక్షలు స్వీకరించిన భక్తులు

లిబరేషన్ ప్రదర్శన



ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు మండలంలోని పాండవుల పాలెంలో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతంలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకోవడం లేదని నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులకు ఐటీడీఏ లేకుండా పోయిందని, తక్షణం సబ్‌ప్లాన్ గిరిజనులకు అందే సదుపాయాలు, పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, లిబరేషన్ కమిటీసభ్యులు మానుకొండ లచ్చబాబు, రెల్లి సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, శ్రీను, సీతారామరాజు, లక్ష్మణరావు, గంగాలమ్మ, వీరలక్ష్మి తదితరులున్నారు.



ఐటీడీఏ పీవోను కలిసిన దేవీపట్నం నిర్వాసితులు

దేవీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన దేవీపట్నం గ్రామానికి చెందిన నిర్వాసితులు బుధవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని ఆయన కార్యాలయంలో కలిశారు. దేవీపట్నం గ్రామానికి గోకవరం మండలం గంగాలమ్మ తల్లి ఆలయ సమీపంలో ఇళ్ల స్థలాలకు సంబంధించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పీవో స్పందించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీకు పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇందుకూరులో ఆట స్థలం సర్వే

దేవీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామంలో ఆట స్థలాన్ని బుధవారం మండల, సచివాలయ సర్వేయర్లు సర్వే చేశారు. వారిని ఆదివాసీ కొండదొరల సంఘం, ఆదివాసీ జేఏసీ దేవీపట్నం మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ కలిశారు. గతంలో ఈ ఆట స్థలం కోసం తహసీల్దారు, సబ్ కలెక్టర్‌లకు వినతులు ఇచ్చామన్నారు. అధికారులు స్పందించి సర్వే చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, బండారు వీరబాబు, దూసరి హరిబాబు, కొట్టుం ప్రసాద్, ఈరేటి యువ కిరణ్, సర్వేయర్లు శివ, సతీష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల జాగ్రత్తలపై అవగాహన

రంపచోడవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ శిక్షణ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.చినబాబు, సిబ్బంది కె.పోతురాజు, జె.వెంకటలక్ష్మి, ఎం.సామ్రాజ్యం, కె.బాపిరాజు, వి.సిద్ధార్థ, పి.లక్ష్మణరెడ్డి, కె.శ్రీనుబాబు, అగ్నిమాపక సిబ్బంది ఎస్.గంగన్నదొర, కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధి ఏపీడీ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏపీడీ

గండేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉప్పలపాడు గ్రామంలో పనికి రాకుండా మస్తర్లు వేశారని, ఉపాధి హామీ నిధులు పక్కదారి పట్టాయని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఉపాధి హామీ ఏపీడీ భాను ప్రకాష్ గ్రామానికి వచ్చి రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధి రికార్డులు తనిఖీ చేశారు. ఏపీడీ మాట్లాడుతూ ఆరోపణలపై రికార్డులు తనిఖీ చేయడం జరిగిందని, నివేదిక ఉన్నతాధికారులకు పంపించి త్వరలో నిజనిర్ధారణ చేస్తామన్నారు. ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్, కార్యదర్శి తరంగణి, టీఏ శ్రీను పాల్గొన్నారు.

కళాకారుడు భద్రం మృతి

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో ఓ సీనియర్ కళాకారుడు బలిజ భద్రం ఆకస్మికంగా మృతిచెందాడు. స్థానిక వీర వెంకట విజయదుర్గ నాట్యమండలి సభ్యుడైన బలిజ భద్రం బాలనాగమ్మ, మాయల ఫకీర్, చింతామణి, తదితర నాటకాలతో పాటు అనేక గౌరీశంకర్ల వీధి కళాప్రదర్శనలో వీధి కళ ఉత్సవాల్లో అనేక ప్రదర్శనలిచ్చాడు. నాట్య మండలి అధ్య క్షుడు సానా నూకరాజునాయుడు, సభ్యులు బైరా రాజు, కొప్పిశెట్టి బాబులు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

తుని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుని మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెన్సెస్ శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో సాయి నవీన్ అధ్యక్షతన జరిగింది. సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ శిక్షణలో సచివాలయ ఉద్యోగులు యానిమేటర్స్‌గా పని చేస్తారని... ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, విద్యేతర నైపుణ్యాలు యాప్‌లో నమోదు చేస్తారని ఎంఈవో తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

కోటనందూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం రాత్రి వంటగ్యాస్ లీకై సిలిండర్ పేలిన సంఘటనలో కాపారపు అప్పన్నబాబు ఇల్లు కాలి బూడిదైంది. బాధిత కుటుంబానికి పాతకొట్టాం టీడీపీ నేత షేక్ నవాబ్‌జానీ బుధవారం 25 కిలోల బియ్యం, రూ.5వేలు అందజేసారు. గ్రామ వీఆర్వో సొంత నిధులు రూ.2వేలు, ప్రభుత్వం నుంచి 20 కిలోల బియ్యం అందజేశారు. పక్కుర్తి అప్పలరాజు, బర్లవెంకినాయుడు, విష్ణుగంగరాజు, నరసింహమూర్తి సహాయం చేశారు. కోటనందూరు ఎస్ఐ రామకృష్ణ అప్పన్నబాబు కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం, రూ.2 వేలు విలువ చేసే వంటసామగ్రిని అందజేశారు.

చాకలి దిబ్బడు కళా ప్రదర్శన

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక కళాకారులు నిర్వహించిన చాకలి దిబ్బడు ప్రదర్శన హాస్యభరితంగా సాగింది. రామాయణంలోని రాముడు పట్టాభిషేకం అనంతరం సీతాదేవితో కలిసి రాజ్యపాలన చేస్తున్న సమయంలో చాకలి దిబ్బడు ఘటాన్ని ఇతివృత్తంగా ప్రదర్శించి నవ్వించారు. దిబ్బడిగా అప్పికొండ రమణ, అల్లుడిగా మోరుకుర్తి శ్రీనివాస్, భార్యగా రాచపల్లి సత్తిబాబు, సవితిగా పక్కుర్తి కృష్ణ, పిల్లలుగా వైభోగుల శ్రీధర్,మేకా శ్రీను నటించారు.

రిమ్‌జిమ్ పోటీలు


ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

తుని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో రిమ్‌జిమ్-2024 పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖల విద్యార్థులు 4500 మంది పాల్గొన్నారు. సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలతో 29రకాల పోటీలు నిర్వహిస్తున్నట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు.